



ఇలా రకరకాల పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక చిత్రాలను ఈ ప్రాసాదం కుడ్యాలపై హుందాగా కొలువుదీర్చాడు. గతంలో ఆయన సేకరించిన ఎన్నో అరుదైన చిత్రాలతో ప్యాలెస్ అంతా నింపేశాడు. భవనంలో భారీ షాండ్లియర్లు ఏర్పాటు చేయించాడు. విక్టోరియన్ ఫర్నిచర్, గడియారాలు, చైనాలో తయారైన పింగాణీ కూజాలు, ఐరోపా శిల్పాలను ప్యాలెస్ మందిరాల్లో, వరండాల్లో, గార్డెన్‌లో ప్రతిష్ఠించాడు. మూడు అంతస్తుల భవనంలో ప్రతి గదినీ ఓ మయసభ మంటపంగా మార్చేశాడు. ప్యాలెస్‌కు వచ్చిన ప్రతి ఒక్కరూ వాటిని చూస్తూ మైమరచి పోయేవారు. ఒకసారి ఈ భవనాన్ని సందర్శించిన ఆనాటి బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ మింటో దీనికి 'మార్బుల్ ప్యాలెస్'గా నామకరణం చేశాడు.

### మొదటి జంతుప్రదర్శనశాల

మార్బుల్ ప్యాలెస్‌లో అందమైన గార్డెన్, అందులో ముచ్చటగొలిపే ఫౌంటెన్లు ఉన్నాయి. పశుపక్ష్యాదులను సంరక్షించే ఓ జంతు ప్రదర్శనశాల కూడా ఉంది. కలకత్తా నగరంలో మొదటి జంతు ప్రదర్శనశాల ఇదే. భారత భూభాగంలో పెరిగే వివిధ రకాల జంతు జాతుల పట్ల ఐరోపా దేశాల వాళ్లు ఆసక్తి చూపేవాళ్లు. అందుకు తగిన జంతు జాతుల్ని ఐరోపా దేశాలకు ఇక్కడి నుంచి సరఫరా చేశారు. ఇలా ఐరోపా దేశాల వాళ్లకు మన భూభాగంలోని జంతువులు పరిచయమయ్యాయి. హిమాలయాలలో పెరిగే అరుదైన నెమలిని ఇంగ్లండ్ ప్రభుత్వానికి అధ్యయనం కోసం అందించాడు రాజేంద్రమాలిక్. ఇలా అరుదైన జీవజాతులను సంరక్షిస్తున్నందుకు గానూ, బయోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇంగ్లండ్ సంస్థ మార్బుల్ ప్యాలెస్‌కి బంగారు పతకం బహూకరించింది. ఇప్పటికీ ఇందులో కృష్ణ జింకలు, దుప్పులు, రకరకాల కోతులు, పక్షులు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.

### పేదల మ్యూజియం

కలకత్తా నగరానికి రాజేంద్రలాల్ అందించిన కానుక మార్బుల్ ప్యాలెస్.  ఈ వారసత్వ కట్టడం ఎన్నో అద్భుతాల నిలయం! వాటిని కాపాడుకుంటూ రాజేంద్రలాల్ వారసత్వాన్ని ఆయన వారసులూ నిలబెడుతున్నారు. కుటుంబ సభ్యులే ట్రస్టుగా ఏర్పడి ఈ ప్యాలెస్‌ని నిర్వహిస్తున్నారు. పేదల కోసం రాజేంద్రలాల్ భవనాన్ని నిర్మిస్తే.. ఆయన వారసులూ అదే పంథాను కొనసాగిస్తున్నారు. పర్యాటకులు ఎవరైనా ప్యాలెస్‌ను ఉచితంగా సందర్శించే వెసులుబాటు కల్పించారు. ఇక్కడి సుందరమైన శిల్ప సౌందర్యాన్ని వీక్షిస్తూ భవనమంతా తిరగొచ్చు. కనువిందు చేసే ప్యాలెస్ పర్యటనలో పసందైన విందు కూడా ఉంది. అది కూడా ఉచితం! ప్రతి రోజూ మార్బుల్ ప్యాలెస్‌లో 500 మందికి అన్నదానం జరుగుతుంది. కలకత్తాకు వచ్చిన పర్యాటకులు దక్షిణేశ్వర్ కాళి ఆలయంలో దండం పెట్టుకొని... చౌరంగీ రంగుల దునియాలో విహరించి, హౌరాబ్రిడ్జ్ కిందుగా స్టీమర్‌లో ప్రయాణించి ఊరుకోరు. 'మార్బుల్ ప్యాలెస్' అందాలు కండ్లారా వీక్షించాకే, అక్కడి విశేషాలను మనసారా ఆస్వాదించాకే 'యమహానగరి కలకత్తా పురీ' అని వేటూరి పల్లవి అందుకుంటారు. ■

**నాగరిక సమాజంలో రేపటి కోసం ఎన్ని ఆవిష్కరణలు అవసరమో, నిన్నటి అద్భుతాలను కాపాడుకునేందుకు అంతకుమించిన సంరక్షణ కూడా అవసరం. పేదల కడుపు నింపడానికి రాజా రాజేంద్రలాల్ మాలిక్ చేపట్టిన నిర్మాణం.. భూలోక ఇంద్రభవనం. ఈ మార్బుల్ ప్యాలెస్ ఆయన కళాభిరుచికి, దార్శనికతకు మచ్చుతునక.**




